కలెక్టర్ బంగ్లాలో కొండచిలువ



చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విడవకుండా కురుస్తున్న వర్షాలతో ఇబ్బంది పడ్డ ఓ కొండచిలువ కలెక్టర్ బంగ్లాకు చేరి హల్‌చల్ చేసింది. పలుశాఖల అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగి ఐదు గంటలు కష్టపడి రిజర్వుఫారెస్టులో వదిలేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కలెక్టర్ బంగ్లాకు చేరుకున్న ఆరడుగుల కొండచిలువ అక్కడి వేపచెట్టు పైభాగానికి వెళ్ళి ఒళ్ళు ముడుచుకుని పడుకుంది. చెట్టెక్కిన కొండచిలువను సిబ్బంది గుర్తించి కేకలు వేశారు. అటవీశాఖ అధికారులకు సమాచారమందించారు.స్నేక్ కేచర్ ప్రేమ్‌తో కలిసి అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకున్నారు. చెట్టు కొమ్మలు కత్తిరించి, టార్చ్‌లైట్ వెలుగులో కొండచిలువను చాకచక్యంగా ఒడిసిపట్టుకుని కిందకు చేర్చారు. ఈ తతంగం అర్ధరాత్రి ఒంటిగంట దాకా సాగింది. ఆ తర్వాత దానిని బుధవారం ఉదయం సమీపంలోని రిజర్వు ఫారెస్ట్‌లో వదిలేశారు.

రూ.65 లక్షల విలువైన మొబైళ్ల రికవరీ

చిత్తూరు అర్బన్/గంగాధరనెల్లూరు, అక్టోబరు 23: దాదాపు 65 లక్షల రూపాయల విలువైన మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి పోగొట్టుకున్నవారికి అందజేశారు.చిత్తూరులో బుధవారం మీడియా సమావేశంలో ఎస్పీ మణికంఠ ఆ వివరాలను వెల్లడించారు. జిల్లాలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్నట్లు చాట్‌బాట్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను స్వీకరించి 30 రోజుల్లో 300 ఫోన్లను రికవరీ చేశామని చెప్పారు. మన రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర,కేరళ రాష్ట్రాల నుంచి కూడా వీటిని రికవరీ చేశామన్నారు. వీటిలో 70 మొబైల్‌ఫోన్లను రికవరీ చేసిన గంగాధరనెల్లూరు హెడ్‌కానిస్టేబుల్ దామోదరం ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు, చాట్‌బాట్ సిబ్బంది పాల్గొన్నారు.



చాట్‌బాట్ ద్వారా రికవరీచేసిన ఫోన్లను చూపిస్తున్న ఎస్పీ మణికంఠ



ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న హెడ్‌కానిస్టేబుల్ దామోదరం

● **చాట్‌బాట్‌కు ఫిర్యాదు పంపేదిలా...**

మొబైళ్లను పోగొట్టుకున్న వారు ముందుగా 9440900004 నెంబరు వాట్సాప్‌కు హాయ్ లేదా హెల్ప్ అని పంపాలి.వెంటనే వెల్‌కమ్ టు చిత్తూరు పోలీసు పేరున ఒక లింకు వస్తుంది. ఆ లింకులోని గూగుల్ ఫార్మాట్ ఓపెన్ అయ్యాక వివరాలను పూరించాలి. జిల్లా పేరు, వయస్సు, తండ్రి, చిరునామా, కాంటాక్టు నెంబరు, మిస్సయిన మొబైల్ మోడల్, ఐఎంఈఐ నెంబరు, మిస్సయిన ప్లేస్ వివరాలను పూరించిన వెంటనే ఫిర్యాదు నమోదవుతుంది. చాట్‌బాట్‌సేవలను ప్రజలు వినియోగించుకోవాలని, ఫోన్ చోరీకి గురైన వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

అమ్మో ఒంటరి ఏనుగు!



రెడ్యానాయక్ మృతదేహం



గ్రామస్థులను విచారిస్తున్న పోలీసు, అటవీ అధికారులు



రెడ్యానాయక్

● మదగజం దాడిలో మరొకరు హతం ● నాలుగు నెలల్లో ఇద్దరి మృత్యువాత

● గ్రామీణులను వణికిస్తున్న గతానుభవాలు

కుప్పం/రామకుప్పం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):కుప్పం నియోజకవర్గ గ్రామీణులను ఒంటరి ఏనుగు చాలాకాలంగా వణికిస్తోంది.వారం రోజుల క్రితం కుప్పం మండలంలోని జనావాసాల్లో కనిపించిన ఈ మదపుటేనుగు రామకుప్పం మండలంలోనే నాలుగు నెలల వ్యవధిలో ఇద్దరు రైతులను చంపేసింది. ఈ నేపథ్యంలో ఇంకెన్ని భీతావహ అనుభవాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు.

సాధారణంగా ఏనుగులు గుంపులుగా సంచరిస్తాయి. ఆహారంకోసమో, దాహం తీర్చుకోవడానికో అడవుల మధ్యనుంచి జనావాసాలవైపు వస్తూ దాడులు చేస్తాయి. గుంపులో ఉన్నప్పుడు వీటినుంచి ప్రమాదం తక్కువే ఉంటుంది. జనాలు గుంపులుగా చేరి డప్పులు వాయిస్తూనో, టపాసులు కాలుస్తూనో భయపెడితే, వెళ్లిపోతాయి. మళ్లీ చాలాకాలం ఇటువైపు తిరిగి చూడవు. కానీ గుంపునుంచి విడిపోయిన ఒంటరి ఏనుగు చాలా ప్రమాదకరమైనది. ఇది తాత్కాలికంగా మనుషుల అదిలింపులకు బెదిరినా, మళ్లీ మళ్లీ దాడికి తెగబడుతూనే ఉంటుంది.తత్ఫలితంగా గ్రామాల శివార్లలోని పొలాల్లో కాపలా ఉండే లేదా ఇతర పనులు చేసుకునే రైతులు మృత్యువాత పడుతుంటారు. వరుస దాడుల వల్ల ఒక్కోసారి వారం రోజుల వ్యవధిలోనే ముగ్గురు నలుగురు ప్రాణాలు కోల్పోయే సందర్భాలు కూడా ఉంటాయి. ఇటువంటి సందర్భం నాలుగేళ్ల క్రితం 2020వ సంవత్సరం సెప్టెంబరు చివర, అక్టోబరు మొదటి వారాల్లో కుప్పం నియోజకవర్గంలో చోటు చేసుకుంది. ఆంధ్రా, కర్ణాటక సరిహద్దులోని గ్రామాల అటవీ పరిధిలో గుడుపల్లె, కుప్పం, శాంతిపురం మండలాల్లో ఏకంగా ముగ్గురు ఆ ఒంటరి ఏనుగు దాడికి బలైపోయారు. కేవలం ఆరు రోజుల్లో ముగ్గురు గ్రామీణులు మృత్యువాత పడ్డారు. తమిళనాడు సరిహద్దుల్లో గున్న ఏనుగుతోపాటు ఆడ ఏనుగును వెంటేసుకుని కుటుంబ సమేతంగా సంచరించే మగ ఏనుగు ఉన్నట్టుంటి ఒంటరి కావడమే దీనికి కారణం. గున్న ఏనుగుతోపాటు ఆడ ఏనుగును వేటగాళ్లు క్రూరంగా చంపేయడంతో ఒంటరిగా మారిన ఏనుగు, పిచ్చి పట్టినట్లు సంచరిస్తూ గ్రామాలలోకి వచ్చేసి ముగ్గురి ప్రాణాలను హరించింది.

మృతుడి కుటుంబానికి రూ.10లక్షల పరిహారం



ఒంటరి ఏనుగు దాడిలో మృతి చెందిన రెడ్యానాయక్ కుటుంబానికి ప్రభుత్వం 10లక్షల రూపాయల పరిహారాన్ని అందించింది.రెడ్యానాయక్ చనిపోయిన విషయం తెలిసి కుప్పం అటవీ శాఖాధికారి జయశంకర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, డీఎఫ్‌వో భరణి, సీఐ మల్లేష్‌యాదవ్ పలమనేరు సబ్ డీఎఫ్‌వో ఆస్పత్రి వద్ద రెడ్యానాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నష్టపరిహారంగా రూ.10 లక్షలు చెక్కును రెడ్యానాయక్ కుమారుడు సైరాజ్‌నాయక్‌కు అందజేశారు.టీడీపీ నాయకులు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు,కృష్ణానాయక్, మునిరాజనాయక్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల తరువాత పునరావృతం

రామకుప్పం మండలం పీఎంకే తాండాకు చెందిన రైతు రెడ్యానాయక్ కూడా ఒంటరి ఏనుగు దాడిలోనే మృతి చెందాడు. 46 ఏళ్ల వయసు కలిగిన ఈ గ్రామీణుడిని మంగళవారం రాత్రి అడవి సమీపంలో ఉండగా ఏనుగు దాడిచేసి చంపేసింది. **రెండునెలల క్రితం మరణించిన భార్య ప్రమీల జ్ఞాపకాలు మరువలేక ఆమెను ఖననం చేసిన శ్మశానం వద్దకు వెళ్ళిన రెడ్యానాయక్ బుధవారం ఉదయం శవమై పడివుండగా పశువుల కాపర్లు గుర్తించారు.** రెడ్యానాయక్ ప్రాణాలు హరించిన ఏనుగుకు కూడా కుటుంబం వుందని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు.ఆంధ్రా-తమిళనాడు సరిహద్దులో రెండు ఏనుగుల జంటతోపాటు, ఒక గున్న ఏనుగు సంచారాన్ని అధికారులే కాదు, గ్రామీణులు సైతం ఇటీవల గమనిస్తున్నారు. రెండుమూడు సార్లు ఈ ఏనుగులు గ్రామాలమీద పడితే, అధికారులు అటవీ సిబ్బందితో కలిసి అడవుల్లోకి తరిమేశారు. ఇటీవల ఒక్క ఏనుగు మాత్రమే అటవీ సమీప జనావాసాల వద్ద సంచరిస్తున్న విషయం గ్రామీణులు చాలాకాలంగా గమనిస్తున్నారు.ఆ ఒంటరి ఏనుగే ఇప్పుడు .**పీఎంకేతాండాకు చెందిన** రెడ్యానాయక్(48)ను దాడిచేసి చంపేసింది.నాలుగు నెలల క్రితం అంటూ జూన్ 15న ఇదే గ్రామానికి చెందిన వృద్ధ రైతు కన్నా నాయక్ కూడా ఇదే ఒంటరి ఏనుగుకు బలైపోయాడు. సాధారణంగా ఎప్పుడైనా సరే గున్న ఏనుగుతోపాటు రెండు పెద్ద ఏనుగుల జంట కలిసి కనిపించేది. ఇప్పుడు మిగిలిన రెండు ఏనుగులు ఏమైపోయాయో తెలియడంలేదు.2020లో ఒంటరి ఏనుగుకు జరిగినట్లు మిగిలిన రెండు ఏనుగులు వేటగాళ్ల ఉచ్చుకు బలైపోయాయా అన్న అనుమానాలు గ్రామీణులు వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ అదే కనుక జరిగివుంటే, అటవీ సమీప గ్రామాలతోపాటు అటవీ శాఖాధికారులు సైతం మరింత అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. కుటుంబాన్ని కోల్పోయి ఒంటరిగా సంచరిస్తున్న ఏనుగు చాలా ప్రమాదకమైనదని 2020 నాటి మూడు మృత్యు సంఘటనలే కాదు, అనంతరం కుప్పం, పలమనేరు నియోజకవర్గాల పరిధిలో జరిగిన అనేక సంఘటనలు నిరూపించాయి. మళ్లీ ఏ క్షణమైనా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎక్కడైనా ఆ ఒంటరి ఏనుగు దాడిచేసే ప్రమాదముంది.వారం రోజుల కిత్రం కుప్పం మండలం నూలుకుంట సమీప అటవీ ప్రాంతంనుంచి ఈ ఒంటరి ఏనుగు జనావాసాల్లోకి వచ్చింది. అటవీ శాఖాధికారులు దీన్ని కంగుంది, రామకుప్పం మండలం నారాయణపురం తాండా మీదుగా తమిళనాడు అడవుల్లోకి తరిమేశారు.కానీ, అది మళ్లీ జనావాసాలవైపు రాదని గ్యారంటీ ఏమీ లేదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరం తమకు రక్షణ కల్పించాలని గ్రామీణులు కోరుతున్నారు. కాగా రామకుప్పం మండలం పీఎంకే తాండాలో రెడ్యానాయక్ అనే రైతును చంపేసిన ఒంటరి ఏనుగును అడవుల్లోకి తరిమేశామని కుప్పం అటవీ శాఖాధికారి జయశంకర్ తెలిపారు. గ్రామీణులు రాత్రివేళ ఒంటరిగా అడవుల సమీపంలోని పొలాల్లో సంచరించవద్దని ఆయన హెచ్చరించారు.



ముసునూరులో జగన్నాథరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పారిపోబోతూ శవమై తేలాడు

- ఎంపీటీసీ జగన్నాథరాజు మృతిపై పోలీసులు
- గాయాలున్నాయి..కొట్టారంటున్న కుటుంబం
- పోలీసుల అదుపులో 12మంది నిందితులు

గంగాధరనెల్లూరు/పాలసముద్రం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలం టీవీఎస్‌పురం గ్రామానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ జగన్నాథరాజు కిడ్నాపర్లనుంచి పారిపోబోతూ చనిపోయినట్లు పోలీసులు తేల్చారు.ఏలూరు జిల్లా నూజివీడు సీఐ రామకృష్ణ, ముసునూరు ఎస్ఐ చిరంజీవి కథనం మేరకు.. ఏడాది కిందట జగన్నాథరాజు నూజివీడుకు చెందిన నాగబాబు వద్ద ఫైనాన్స్‌లో పొక్లయినర్ తీసుకున్నారు. నెలవారీ కంతులు కట్టకపోవడంతో రెండు నెలల కిందట ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో నాగబాబు ఫిర్యాదు చేశారు. జగన్నాథరాజు పొక్లయినర్‌ను అమ్మేశారని నాగబాబుకు సమాచారం అందింది. ఏలూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, కర్నూలు జిల్లాల్లో కూడా జగన్నాథరాజు ఇలాగే కంతులు కట్టలేదని సమాచారం. దీంతో వారంతా 12 మంది మాట్లాడుకుని సోమవారం చిత్తూరు జిల్లాకు చేరుకుని జీడీనెల్లూరులో జగన్నాథరాజును కిడ్నాప్ చేసి నూజివీడుకు తరలించారు. మంగళవారం తెల్లవారుజామున ముసునూరు మండలం కాత్రేనుపాడు గ్రామ శివారులో బహిర్భూమికంటూ జగన్నాథరాజు వాహనం దిగారు. ఆయన వెంట ఒకరు వెళ్లినప్పటికీ తప్పించుకుని పారిపోయాడు. ఉదయం 5 గంటలకు అక్కడి పామాయిల్ తోటలో జగన్నాథరాజు పడివున్నాడు. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో వారంతా పోలీసులకు విషయం చెప్పారు. జగన్నాథరాజు భార్యకు కూడా సమాచారం అందించారు. మంగళవారం కిడ్నాప్ కేసు నమోదు చేసిన జీడీనెల్లూరు సీఐ లక్ష్మీనారాయణ నూజివీడుకు జగన్నాథరాజు కుటుంబీకులతో వెళ్లారు. అక్కడ నూజివీడు సీఐ రామకృష్ణతో కలిసి విచారణ చేశారు. బుధవారం జగన్నాథరాజు పోస్టుమార్టం పూర్తి చేశారు. రిపోర్టును వైద్యులు బుధవారం రాత్రికి కూడా ఇవ్వలేదు. జగన్నాథరాజు మృతి కేసులో 12మందిని ముసునూరు పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. జీడీనెల్లూరు స్టేషనులో కేసు నమోదు కావడంతో ముసునూరులో కేసు పెట్టలేదు. కాగా.. నూజివీడు వెళ్లిన కుటుంబ సభ్యులు జగన్నాథరాజు మృతదేహాన్ని చూసి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జగన్నాథరాజు కుడి కంటి వద్ద గాయమై వుండడం, ముక్కులో, నోట్లో రక్తం ఉండడంతో తీవ్రంగా కొట్టినట్టు అనుమానముందంటున్నారు. కుటుంబ సభ్యుల ఆరోపణలతో జగన్నాథరాజు మృతిపై మళ్లీ అనుమానాలు వస్తున్నాయి.



రూ.ఐదుకు ఏం వస్తుంది

టీ తాగాలంటే కనీసం పది రూపాయలు ఖర్చు పెట్టాలి. అదే అన్న క్యాంటీన్‌లో రూ.ఐదుకి కడుపునిండా భోజనం చేయొచ్చు. వెంకటగిరిలోని అన్న క్యాంటీన్‌లో బుధవారం నుంచి ఉదయం అల్పాహారంతో పాటు రెండు పూటలా భోజనాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీంతో నిరుపేదలు, కూలీలు, కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే తాము భోజనానికి ఇంటికి వెళ్లకుండా, రూ.5కే భోజనం చేయగలుగుతున్నామని పలువురు చెప్పారు. హోటళ్లకు వెళ్లి భోజనం చేసే స్థోమతలేని వారికి అన్న క్యాంటీన్ ఆకలి తీరుస్తోంది.

- వెంకటగిరి, ఆంధ్రజ్యోతి

రికార్డులన్నీ ఓకేనా..!

ఇప్పుడన్ని కార్యాలయాలు డిజిటల్‌గా మారుతున్నాయి. రెవెన్యూలోనూ చాలావరకు కంప్యూటరైజ్ చేశారు. అయినా, పాత రికార్డులన్నీ కార్యాలయంలోని ఓ గదిలో భద్రంగా ఉంచారు. అలా బాలాయపల్లి తహసీల్దారు కార్యాలయంలో ఉంచిన రికార్డులను బుధవారం కలెక్టరు వెంకటేశ్వర్ పరిశీలించారు. వర్షాలకు ఉరవడం వల్ల ఏమైనా తడిచాయా అని చూశారు.

- బాలాయపల్లి, ఆంధ్రజోతి



నేడు ప్రపంచ పోలియో నివారణ దినం



థ్యాంక్యూ బర్డ్

పోలీయోతో శారీరకంగానే కాదు మానసికంగా కూడా కుంగిపోయినవారి పాలిట ఆశాదీపంలా ఒకప్పుడు వెలిగింది తిరుపతిలోని బర్డ్ (బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సర్జరీ, రీసెర్చ్, అండ్ రీహాబిలిటేషన్ ఫర్ ది డిజేబుల్డ్). దేశం నలుమూలల నుంచీ నిత్యం వందలాదిమంది వైకల్యంతో ఈ ప్రాంగణంలో కనిపించేవారు. సర్జరీ, ఫిజియోథెరపీల తర్వాత కృత్రిమ కాళ్లతో నడుస్తూ ఆత్మవిశ్వాసం పెంచుకుని ఊళ్లకు వెళ్లేవారు. దేశంలో ఎక్కడి నుంచి వచ్చినా.. ఉండడానికి వసతి చూపి, తినడానికి తిండి పెట్టి, ఆపరేషన్ చేసి పంపేవారు. సకలమూ ఉచితమే ఇక్కడ. తిరుపతికి వచ్చే అనేక రైళ్లలో ఒకప్పుడు పోలీయో వల్ల వైకల్యానికి గురైన పిల్లలే కనిపించేవారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు మదిలో మెదిలి తిరుపతిలో ప్రాణం పోసుకున్న ఆసుపత్రే బర్డ్. పేదల కోసం టీటీడీ ఆధ్వర్యంలో దీనిని 1985లో ప్రారంభించారు. ఈక్రమంలో 1994లో బర్డ్ ఒక ట్రస్ట్‌గా ఏర్పాటై దేశవ్యాప్త సేవలందించింది. పోలియో వాక్సిన్‌తో ప్రభుత్వాలు తీసుకున్న గట్టి చర్యల వల్ల దాదాపుగా ఇప్పుడీ వ్యాధి అంతరించింది. పదేళ్లుగా ఒక్కటంటే ఒక్క పోలీయో కేసు బర్డ్‌కు రాలేదు. దీంతో బర్డ్ ఇతర వైద్య సేవల్లోకి విస్తరించింది. మోకీళ్ల, తుంటి మార్పిడి చికిత్సలపై దృష్టి పెట్టింది. బర్డ్‌లో ఎందరో డాక్టర్లు సేవా దృక్పథంతో సేవలందించారు. బర్డ్ అనగానే ఇద్దరి పేర్లు అందరి మదిలో మెదులుతాయి. వ్యాఘ్రేశ్వరుడు, జగదీష్‌ల సారథ్యంలో బర్డ్ సేవలు దేశవ్యాపితంగా అందాయి. ప్రపంచ పోలియో నివారణ దినం సందర్భంగా బర్డ్ వైద్యులకు నమస్కరించుకుంటూ బర్డ్ సేవలను గుర్తు చేసుకుందాం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పోలియో రోగులకు బర్డ్ సేవలు

- బర్డ్ ఆసుత్రిలో 90,589 మంది పోలియో వ్యాధి గ్రస్తులకు ఆపరేషన్లు చేశారు.
- బర్డ్ వైద్యులే దేశంలోని అనేక ప్రాంతాలకు వెళ్ల శిబిరాలు నిర్వహించి, 11448 మందికి ఆ ప్రాంతాల్లోనే ఆపరేషన్లు చేశారు.
- పోలియో స్ర్కీనింగ్ శిబిరాల ద్వారా పరీక్షించిన రోగుల సంఖ్య: 83,173
- ఆపరేషన్ అవసరమని గుర్తించినది :73,539
- బర్డ్ ద్వారా బూట్లు వంటి పరికరాలు అందుకున్న రోగులు : 9466





డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడు బర్డ్ తొలి డైరెక్టర్‌గా (1984-87) విశేష కృషి చేశారు. దేశవ్యాప్తంగా ఉచిత పోలియో శిబిరాలు నిర్వహించే కార్యక్రమం ఈయన ప్రారంభించారు.



డాక్టర్ జగదీష్ బర్డ్ డైరెక్టర్‌గా (1993-2019) సుదీర్ఘకాలం సేవలందించారు. దేశంలోని అనేకప్రాంతాల్లో పర్యటిస్తూ వైద్యసేవలందించేవారు. పోలియో సహా అనేక రకాల ఆపరేషన్లు దాదాపు 90 వేలు ఈయన సారథ్యంలో జరిగాయి.

- మన దేశంలో 1972లో పోలియో వ్యాక్సినేషన్ ప్రారంభమైంది. 1985లో దాదాపు అన్ని జిల్లాలకు విస్తరించింది.
- చివరి పోలీయో కేసులో 2011లో పశ్చిమ బెంగాల్, గుజరాత్‌లలో నమోదయ్యాయి.
- 2014లో భారత్‌ను పోలియో రహితదేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.

జనవరి రూ.300 దర్శన టికెట్ల కోటా విడుదల నేడు

- శ్రీవాణి టికెట్లు కూడా -

తిరుమల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను టీటీడీ గురువారం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు టీటీడీ అధికార వెబ్‌సైట్ 'తిరుమలతిరుపతిదేవస్థానమ్స్' ద్వారా విడుదల చేస్తారు. జనవరిలో 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాలు ఉండటంతో భక్తులు ఈ టికెట్ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.అలాగే ఉదయం 11గంటలకు జనవరి నెలకు సంబంధించిన శ్రీవాణి ట్రస్టు దాతల బ్రేక్ దర్శన టికెట్లను కూడా విడుదల చేయనున్నారు. రోజుకు 500 టికెట్ల చొప్పున వైకుంఠ ఏకాదశి రోజులను మినహాయించి విడుదల చేయనున్నారు.

పుదుచ్చేరి సీఎం సిఫార్సు లేఖపై శ్రీవారి దర్శన టికెట్లు పొంది బ్లాక్‌లో విక్రయం

- అదుపులోకి తీసుకున్న టీటీడీ విజిలెన్స్ -

తిరుమల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సీఎం సిఫార్సు లేఖపై పొందిన శ్రీవారి దర్శన టికెట్లను ఓ వ్యక్తి బ్లాక్‌లో విక్రయించాడు. వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు ఇస్తానని చెప్పి రూ.300 దర్శన టికెట్లు ఇవ్వడంతో ఈ అక్రమం వెలుగులోకి వచ్చింది.టీటీడీ విజిలెన్స్ అధికారుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన మురళీ శంకర్‌రెడ్డి ఐదు వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు కావాలని తిరుపతిలో వుంటోన్న పుదుచ్చేరికి చెందిన పద్మనాభన్ అలియాస్ భరత్ అనే దళారీని సంప్రదించాడు.ఒక్కో బ్రేక్ టికెట్‌కు రూ.4,600 చొప్పున ఐదు టికెట్లకు రూ.23 వేలు పద్మనాభన్ వసూలు చేశాడు.మంగళవారం దర్శనానికి వచ్చిన మురళీ శంకర్‌రెడ్డికి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు ఇవ్వకుండా రూ.300 దర్శన టికెట్లు ఇవ్వడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.గమనించిన విజిలెన్స్ అధికారులు పద్మనాభన్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో ఈ విషయం వెలుగు చూసింది. మురళీ శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు నివేదికను తిరుమల టూటౌన్ పోలీసులకు అందజేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రలేఖనంలో యామిని ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న యామిని

శ్రీకాళహస్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చిత్రలేఖనం పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన యామిని జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. యామిని పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతోంది. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టం 1994 - ఆడ శిశువును కాపాడుదాం సృష్టిని రక్షిద్దాం' అనే అంశంపై ఇటీవల శ్రీకాళహస్తిలో జరిగిన పోటీల్లో జిల్లాస్థాయికి ఎంపికైంది. తిరుపతి కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా నలుమూలల నుంచి హాజరైన విద్యార్థినులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా యామిని మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. డీఆర్వో పెంచలకిషోర్,డీఎంహెచ్‌వో శ్రీహరి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, రూ.5వేలు నగదు ప్రోత్సాహక నగదు బహుమతి చెక్కును అందజేశారు.



యామిని వేసిన చిత్రం

● క్రైం కార్నర్

ఈజీ మనీ కోసం..!

- దొంగగా మారిన తమిళనాడు యువకుడి అరెస్టు
- రూ.20 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

శ్రీకాళహస్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లో మునిగి.. చెడు వ్యసనాలకు బానిసై... ఈజీ మనీ కోసం 20కిపైగా చోరీలకు పాల్పడిన అంతరాష్ట్ర సీరియల్ దొంగ శ్రీకాళహస్తి పోలీసులకు పట్టుబడ్డాడు. తిరుపతి జిల్లా పరిధిలోని ఐదు చోరీ కేసుల్లో నిందితుడైన ఆ తమిళనాడు యువకుడిని అరెస్టు చేసి రూ.20లక్షల చోరీ సొత్తు రికవరీ చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి బుధవారం తెలిపిన మేరకు.. ఇటీవల శ్రీకాళహస్తి పట్టణంలో రాత్రి, పగటి వేళల్లో పలు చోరీలు జరిగాయి. ఈ కేసులను ఛేదించేందుకు శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని నియమించారు. సీసీ కెమెరాలు, వేలిముద్రలు, మొబైల్ విశ్లేషణ వంటి అధునాతన పరిజ్ఞానంతో ఆ బృందం విచారణ సాగించింది. ఈ క్రమంలో తమిళనాడు రాష్ట్రం తిరవళ్లూరు జిల్లా పోరూరు ప్రాంతానికి చెందిన భరద్వాజన్ ప్రేమ్‌కుమార్ అలియాస్ కుమార్(30)బుధవారం సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకునే క్రమంలో ప్రేమ్‌కుమార్ పారిపోయేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడ్డాడు. తమిళనాడుకు చెందిన ప్రేమ్‌కుమార్‌గా విచారణలో తేలింది. గతంలో 20 చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు నిర్ధారించారు. జిల్లా పరిధిలోని శ్రీకాళహస్తి పట్టణంలో రెండు, బుచ్చినాయుడు కండ్రిగ, రేణిగుంట, తిరుచానూరు సహా ఐదు పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. అతడి నుంచి 220గ్రాముల బంగారు ఆభరణాలు, 2,180 గ్రాముల వెండి వస్తువులు, లాప్‌ట్యాప్, ఐఫోన్ సహా వేలిముద్రలు పడకుండా చేతులకు తొడుకునే గ్లోవ్స్, ఇనుపరాడ్లు స్వాధీనం చేసుకున్నారు. రీకవరి చేసుకున్న సొత్తు విలువ రూ.20లక్షలుగా అంచనా వేశారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు. సులభ సంపాదన కోసం ఒకడే వెళుతూ చోరీలు చేయడంలో దిట్ట అని డీఎస్పీ తెలిపారు. ఇతడిని పట్టుకోవడంలో కృషి చేసిన శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపి, బుచ్చినాయుడు కండ్రిగ సీఐ తిమ్మయ్య, ఎస్ఐ సుధాకర్, ఏఎస్ఐలు గంగయ్య, చక్రవర్తి, కానిస్టేబుళ్లు హేమాద్రి, రవి, ప్రసాద్, కేశవన్, బాలకృష్ణ, గంగాధరం, అరుణ్, భరత్‌ను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.



దొంగ అరెస్టును చూపుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

విహారయాత్రలో విషాదం

- ఉబ్బలమడుగులో మునిగి మనుబోలు యువకుడి మృతి

వరదయ్యపాళెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదాగా గడిపేందుకు విహారయాత్రకు వచ్చిన ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఉబ్బలమడుగు వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నెల్లూరు జిల్లా మనుబోలుకు చెందిన భరత్‌కుమార్(19) తన స్నేహితులతో కలిసి ఉబ్బలమడుగుకు వచ్చాడు. మడుగులో స్నానం చేస్తూ.. లోతున్న ప్రాంతానికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. ఎంతసేపటికీ భరత్‌కుమార్ పైకి రాకపోవడంతో అతడి స్నేహితులు బుచ్చినాయుడుకండ్రిగ పోలీసులకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. మడుగువద్దకు చేరుకున్న పోలీసులు భరత్‌కుమార్ మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బీఎన్‌కండ్రిగ ఎస్ఐ విశ్వనాథం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- భార్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు

రేణిగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం చెంగారెడ్డిపల్లికి చెందిన ఈశ్వరయ్య(43) మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అర్బన్ సీఐ శరత్‌చంద్ర తెలిపిన ప్రకారం.. ఈశ్వరయ్యకు 15 ఏళ్ల కిందట సుజాతతో వివాహం జరిగింది. వీరికి నలుగురు పిల్లలు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో భార్యాభర్తలు హౌస్ కీపింగ్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈశ్వరయ్య మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరుగుతోంది. మంగళవారం రాత్రి మిద్దెపై భార్యాభర్తలు నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో మోదారంటూ పోలీసులకు సుజాత ఫిర్యాదు చేసింది. అర్బన్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్ హత్య ప్రదేశంలో వాసన పసిగడుతూ సుజాత వద్ద ఆగింది. దీంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని రుయాస్పత్రి మార్చురికీ తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



హత్యకు గురైన ఈశ్వరయ్య

వేద సారాంశంపై విస్తృత ప్రచారం

- విజయేంద్ర సరస్వతి

తిరుమల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): అన్ని విద్యల్లో వేద విద్య ఉన్నతమైనదని కంచికామ కోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. తిరుమలలోని ఎస్వీ వేద విజ్ఞానపీఠంలో బుధవారం సాయంత్రం ఆయన వేద విద్యార్థులకు అనుగ్రహ బాషణం చేశారు. ఈసందర్భంగా ఆయనకు వేదవిజ్ఞాన పీఠం అధ్యాపకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ వేద విద్యార్థులు ధర్మ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వేదాలు అభ్యసించే విద్యార్థులకు స్వరూపం, స్వధర్మం, స్వభావం ముఖ్యమని చెప్పారు. ధర్మాన్ని తెలుసుకోవాలంటే వేదాలను తెలుసుకోవడం తప్పనిసరి అన్నారు. మనది సాధువులు, మహర్షులు నడుపుతున్నా దేశమన్నారు. ధర్మం కోసం త్యాగం చేయాలి కానీ ధర్మాన్ని త్యాగం చేయకూడదన్నారు. వేదాల్లోని బావాలు విస్తృతంగా ప్రచారం చేసినప్పుడే బావితరాలకు మంచి జరుగుతుందన్నారు. ధర్మపరిరక్షణకు ఆహార, ఆలోచన నియమాలు పాటించాలన్నారు. విద్యార్థులందరూ వేద విద్య పూర్తయ్యాక ధర్మానికి కార్యకర్తలుగా పనిచేసి సంస్కృత భాషను ప్రచారం చేయాలని సూచించారు. దేశానికి ధర్మం, ఆలయం, సంస్కృతి, ఆచారం ముఖ్యమని ఉపదేశించారు. ప్రతి గ్రామ ఆలయాన్ని తిరుమల ఆలయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీటీడీ చేస్తున్న అనేక కార్యక్రమాల్లో వేద విజ్ఞాన అభివృద్ధి కార్యక్రమం చాలా గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అనుగ్రహభాషణం చేస్తున్న విజయేంద్ర సరస్వతి స్వామి



ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న నర్సింగ్ సిబ్బంది

నర్సింగ్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నర్సింగ్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నికైంది. అసోసియేషన్ ఎన్నికలు రుయాస్పత్రిలో మంగళవారం జరగ్గా, కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడించారు. అధ్యక్షురాలిగా ఎస్.రాధమ్మ, ఉపాధ్యక్షురాలిగా ఎస్.రాణి, కార్యదర్శిగా ఇ.లీలావతి, కోశాధికారిగా ఎం.సారాసుభాషిణితోపాటు కార్యవర్గ సభ్యులుగా జె.వరలక్ష్మి, కె.పద్మావతి, సి.చంద్రావతి, ఏఆర్ హిమబిందు గెలుపొందారు.



అవార్డు అదుకుంటున్న ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ అయూబ్‌ఖాన్

సమష్టి కృషితోనే ఎస్పీడీసీఎల్‌కు అవార్డు

తిరుపతి(ఆటోనగర్) అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్‌కు జాతీయ స్థాయిలో అవార్డు రావడం సంతోషంగా ఉందని, సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందని సీఎండీ సంతోషరావు పేర్కొన్నారు. దేశంలోని విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరుపై ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్(ఐసిసి) నిర్వహించిన సర్వేలో ఏపీఎస్పీడీసీఎల్‌కు రెండవ స్థానం లభించింది. న్యూఢిల్లీలోని ఓ హోటల్‌లో జరిగిన సదస్సులో ఐసీసీ చైర్మన్, కేంద్ర ఇంధన శాఖ మాజీ కార్యదర్శి అనిల్ రజ్దాన్ చేతుల మీదుగా ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ పి.అయూబ్‌ఖాన్ ఈ అవార్డు అందుకున్నారు.

26న పూరీ ఎక్స్‌ప్రెస్ రద్దు

తిరుపతి(సెంట్రల్) అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాను కారణంగా గురువారం పూరీ నుంచి తిరుపతికి బయలుదేరాల్సిన 17479నంబరు గల పూరీ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే యశ్వంతపూర్ నుంచి తిరుపతి మీదుగా హౌరాకు వెళ్లే ఎక్స్‌ప్రెస్(12864)ను బుధవారం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం హౌరా నుంచి బయలుదేరే (12863) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

శ్రీసిటీ గ్రామాల్లో కొనసాగుతున్న భూ సర్వే

- సర్వే తీరును పరిశీలించిన జేసీ

సత్యవేడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పరిధిలోని కొల్లడం, ఇరుగుళం గ్రామాల్లో రెవెన్యూ అధికారుల భూ సర్వే కొనసాగుతోంది. సత్యవేడు తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా కొల్లడం, ఇరుగుళం, పెద్దఈటిపాకంలలో సర్వేయర్లు, వీఆర్వోల బృందం సర్వే చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ గ్రామాల్లోని ప్రభుత్వ, పట్టా భూములకు సంబంధించిన హక్కుదారులు, వారికి సంబంధించిన రికార్డులను సర్వే బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి బుధవారం సర్వే జరుగుతున్న గ్రామాలకు చేరుకుని సర్వే తీరును పరిశీలించారు. భూముల రికార్డులను జేసీ పరిశీలించి, రెవెన్యూ అదికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా జేసీ, ఆర్డీవోల మండల పర్యటనను స్థానిక రెవెన్యూ అధికారులు గోప్యంగా ఉంచడం గమనార్హం.

నవంబరు నుంచి కార్డుదారులకు కందిపప్పు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు నవంబర్ నుంచి కందిపప్పు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని 6.35 లక్షల రేషన్ కార్డులకు గాను 600 టన్నుల కందిపప్పు అవసరం. బుధవారం నాటికి 390 టన్నులు 12 ఎంఎల్ఎస్ పాయింట్లలో అందుబాటులో ఉన్నాయని, మిగిలిన 210 టన్నులు మరో రెండు రోజుల్లో తెప్పించేలా చర్యలు తీసుకుంటున్నామని డీఎస్‌వో సుమతి చెప్పారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి బియ్యంతో పాటు కందిపప్పు కిలో రూ.67, చక్కెర అరకిలో రూ.17 చొప్పున పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 29వ తేదీలోగా సరకులన్నీ రేషన్ దుకాణాలకు చేరేలా చర్యలు చేపట్టామన్నారు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఇది కార్డుదారులకు శుభవార్త అని చెప్పాలి.

పంటలపై ఆగని గజదాడులు


వరి పంటను ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మం డలం చల్లావారిపల్లి వద్ద మంగళవారం రాత్రి, బుధవారం వేకువజామున ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేశాయి. దీంతో టమోటా, వరి, కొబ్బరి, వంకాయ, అరటి, బొప్పాయి పంటలకు అపారనష్టం వాటిల్లింది. పాతపాళ్యం అడవి నుంచి మంగళవారం రాత్రి చల్లావారిపల్లి సమీపానికి చేరుకున్న ఏనుగుల గుంపు ఘీంకారం చేశాయి. కోటపల్లిలోని రైతు శ్రీనివాసులునాయుడుకు చెందిన అర ఎకరా వరిపంట, 50 అరటిచెట్లు, 5 బొప్పాయిచెట్లు, నీటిపైపులు, మోటారును ఏనుగులు ధ్వంసం చేశాయి. చల్లావారిపల్లిలోని రామకృష్ణమనాయుడుకు చెందిన అర ఎకరా వరి పంట, 10 అరటిచెట్లు, ఆదికేశవులునాయుడుకు చెందిన అర ఎకరా వరిపంటను ఏనుగులు ధ్వంసం చేశాయి. సమీపంలో ఇదే రైతుకు సంబంధించి బండపై కుప్పపోసిన 5 బస్తాల వేరుశనగ కాయలను తినేసి మరో 10 బస్తాల వేరుశనగ కాయలను చెల్లాచెదరు చేశాయి. గురుమూర్తికి చెందిన పైపులు, టమోటా కట్టెలను విరిచేశాయి. శేషాద్రినాయుడుకు చెందిన టమోటా, వంకాయ చెట్లను ధ్వంసం చేశాయి. కల్లూరు షాదీమహల్ సమీపంలో వెంకటరమణకు చెందిన 10 కొబ్బరిచెట్లను ఒంటరి ఏనుగు తినేసింది. ధ్వంసమైన పంటలను పశ్చిమ అటవీ విభాగం డిప్యూటీ రేంజర్ కుప్పస్వామి, ఎఫ్‌బీఓ శ్రీదేవి పరిశీలించారు.

29న సివిల్ సర్వీసెస్ క్రీడల జిల్లా జట్ల ఎంపిక

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసుల ఆటల పోటీలు ఈనెల 29న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (మెసానికల్) క్రీడా మైదానంలో జిల్లా స్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో బాలాజీ తెలిపారు. అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, లాన్ టెన్నిస్, హాకీ, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, క్యారమ్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, ఖోఖో, క్రికెట్, తదితర విభాగాల్లో జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు. క్రీడల్లో పాల్గొనే సివిల్ సర్వీసు ఉద్యోగులు శుక్రవారం నుంచి సోమవారం వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 29న మెసానికల్ క్రీడా మైదానంలో ఉదయం 10 గంటలకు క్రీడాకారులు క్రీడలకు సంబంధించి సొంత పరికరాలతో ఎంపికకు హాజరు కావాలని, ఇతర వివరాలకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఎన్టీయార్ జలాశయం నీరు విడుదల


హారతి ఇస్తున్న ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురజాల, మేయర్ అముద

చిత్తూరు అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):వరుస వర్షాలతో నిండిన కల్వకుంట ఎన్టీయార్ జలాశయం నీటిని ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్ బుధవారం విడుదల చేశారు.అంతకుముందు ఎమ్మెల్యేలతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు మురకంబట్టు నుంచి ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా జలాశయం వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి గంగ హారతి ఇచ్చారు.పసుపు, కుంకుమ, పండ్లు, పుష్పాలతో కూడిన సారెను సమర్పించాక రెండు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.మేయర్ అముద,డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ నరసింహ ప్రసాద్,మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, టీడీపీ అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, సీనియర్ నాయకులు వసంతకుమార్, కాజూరు బాలాజీ, త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ త్వరలో అడవిపల్లె ప్రాజెక్టు నీటిని చిత్తూరుకు తీసుకొస్తామన్నారు.ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ కరువు ప్రాంతమైన చిత్తూరు సమీపంలో ఎన్టీయార్ జలాశయాన్ని నిర్మించి మూడు నియోజకవర్గాల ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. కమిషనర్ నరసింహప్రసాద్ మాట్లాడుతూ అడవిపల్లె ప్రాజెక్టు నుంచి చిత్తూరుకు నీటిని తీసుకొచ్చే పనుల్లో ఉన్న సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించామన్నారు.


గేట్లు ఎత్తడంతో ఉరకలెత్తుతున్న గంగమ్మ

ఈ టిప్పర్లను ఎవరు పట్టుకున్నారో!



గంగాధరనెల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్ పక్కన, తహసీల్దార్ ఆఫీస్ వెనుక భాగంలో ఉంచిన ఈ ఆరు టిప్పర్లను ఎవరు పట్టుకున్నారో జనానికి అర్థం కావడం లేదు. చిత్తూరు - తచ్చూరు హైవేరోడ్డు పనులకు ఉపయోగిస్తున్న ఈ టిప్పర్లను ఇక్కడ పార్కు చేశారు. గంగాధరనెల్లూరు మండలంలో సుమారు రెండేళ్ళకు పైగా హైవేరోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ పనులకోసం 22 టైర్లు కలిగిన భారీ టిప్పర్లలో సుమారు 100టన్నుల బరువుగల కంకరరాళ్ళను తరలిస్తుంటారు. పెద్దకాల్వ సమీపంలోని స్టోన్ క్రషర్ నుంచి కంకరరాళ్ళు తరలిస్తుండగా ఈ టిప్పర్లను ఇక్కడికి తీసుకొచ్చినట్లు సమాచారం. అయితే ఏ శాఖ అధికారులు పట్టుకున్నారో తెలియడం లేదు.పోలీసులను అడగ్గా టిప్పర్లను ఏ శాఖ అధికారులు కూడా తమకు స్వాధీనం చేయలేదంటున్నారు. సాధారణంగా గ్రానైట్ లారీలను మైన్స్ లేదంటే ఆర్‌టీవో అధికారులు, లేదంటే విజిలెన్స్ అధికారులు పట్టుకుంటే పోలీసులకు స్వాధీనం చేస్తారు.పోలీసులు తమకు తెలియదంటుండడంతో ఏ శాఖ అధికారులు ఏ కారణం చేత పట్టుకుని ఇక్కడ పెట్టారో అనేది తెలియరాలేదు.

భూసమస్యల పరిష్కార దిశగా

రీసర్వే గ్రామసభలు

● కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కార దిశగా రీసర్వే గ్రామసభలు జరుగుతున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామ సభల్లో రైతుల నుంచి వచ్చి ఫిర్యాదులను 15 రోజుల వ్యవధిలో పరిష్కరించేలా మార్గదర్శకాలు జారీచేశామన్నారు. జనవరి నుండి కొత్త పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా నదుల్లో, చెరువుల్లో ఇసుకను యంత్రాలను వినియోగించి తీసుకెళ్లకుండా నిఘా పెట్టామని తెలిపారు.అక్రమంగా ఇసుక తరలిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదన్నారు.జిల్లాలో ఎంపీ ల్యాడ్స్ నిధులు సక్రమంగా వినియోగించేలా చర్యలు చేపట్టామని, కొన్ని పనులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.15 రోజుల క్రితం మొగిలి ఘాట్ వద్ద జరిగిన వరుస రోడ్డు ప్రమాదాల దృష్ట్యా అక్కడ చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు వివరించారు. దీంతో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, వాహనాల రాకపోకల వేగం కూడా తగ్గిందన్నారు.తాగునీటి సమస్య నివారణ కోసం జిల్లాపరిషత్ నిధులు, వాటర్ మిషన్ నిధులు వినియోగిస్తున్నట్లు వివరించారు.ప్రభుత్వ ఆస్పత్రులలో మందుల నిల్వలు పెంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

10 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 10 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాలవారీగా పూతలపట్టులో 35.0, బైరెడ్డిపల్లిలో 29.2, పాలసముద్రంలో 26.4, పెనుమూరులో 11.2, ఐరాలలో 10.2, పుంగనూరులో 7.4, రొంపిచెర్లలో 6.8, శాంతిపురంలో 2.2, నగరిలో 1.6, పులిచెర్లలో 1.4 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

కుటుంబ సమస్యలతో యువకుడి ఆత్మహత్య


సుహేల్

పలమనేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు పెద్ద మసీదులో కాపురమున్న సుహేల్ (30) బుధ వారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సుహేల్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సమస్యల కారణంగా సుహేల్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. మృతుడి తండ్రి మహమ్మద్ రఫీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇన్నాళ్లూ భయంతో ఉన్నాం

● న్యాయం చేస్తారా... ఆత్మహత్య చేసుకోమంటారా..?
● రీ సర్వే గ్రామ సభలో రైతుల ఆవేదన

గుడిపాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఉన్న భూమి విస్తీర్ణం తగ్గించి ఇతరులకు కేటాయించి.. మాకు అన్యాయం చేశారని... దాన్ని అడిగితే కేసులు పెడతామని భయపెట్టారని.. ఎదిరించలేక ఉండిపోయామని పాపసముద్రం పంచాయతీకి చెందిన జగన్నాథరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం మండలంలోని పాపసముద్రం పంచాయతీ కార్యాలయంలో రీసర్వే గ్రామసభ జరిగింది. సభ ప్రారంభంలోనే గ్రామానికి చెందిన 259-1డిలో 31 సెంట్ల భూమికి గాను 26 సెంట్లుగా రికార్డులో నమోదు చేశారన్నారు. మిగిలిన 5సెంట్ల భూమిని రాసివ్వాలని అడిగితే సరైన సమాధానం చెప్పలేదన్నారు. పలువురు రైతులు కూడా రెవెన్యూ అధికారుల తీరును తప్పు పట్టారు. సర్వేయర్ సరిగ్గా కొలిచి ఇవ్వకపోవడం, వైసీపీ నేతల మాటల వల్ల ఈ సమస్యలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. రుణం పొందాలని బ్యాంకులకు వెళితే రికార్డులు సరిగ్గా లేవని రుణాలు ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యపై తీవ్ర ఘర్షణకు దారి తీయగా మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు జోక్యం చేసుకుని రెండు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామని హామి ఇవ్వడంలో గ్రామ సభ కొనసాగింది. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, రీసర్వే డీటీ రూపారాణి, సర్వేయర్ గోపి, కిరణ్, టీడీపీ నేతలు శంకర్ చౌదరి, గణేష్, అర్జున్, విల్సన్, వైసీపీ నేత చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.


విస్తీర్ణం తక్కువ కావడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

● ఐదేళ్ల కొడుకు సహా తండ్రి మృతి

శ్రీకాళహస్తి, అక్టోబరు 23: ద్విచక్ర వాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ఐదేళ్ల కొడుకు సహా తండ్రి మృతి చెందగా తల్లి చికిత్స పొందుతోంది. ఈ ఘటన బుధవారం రాత్రి శ్రీకాళహస్తి మండలం దొమ్మరపాళెం వద్ద కాసరం రహదారిపై జరిగింది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ తెలిపిన ప్రకారం.. తొట్టంబేడు మండలం చియ్యవరానికి చెందిన రాజేంద్రన్(35) రైతు. బుధవారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణంలో పనులు ముగించుకుని భార్య గుర్రమ్మ, కుమారుడు చైతన్య(5)తో ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. దొమ్మరపాళెం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడగా, గుర్రమ్మ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చైతన్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్ర గాయాలతో విషమ పరిస్థితిలో ఉన్న రాజేంద్రను బంధువులు మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. గుర్రమ్మ ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను ఏరియా ఆస్పత్రి మార్చురీకితరలించారు.

ఎస్వీఆర్ డిస్టిలరీస్‌లో ముగిసిన సీఐడీ తనిఖీలు

● పలు రికార్డులు, హార్డు డిస్కులు స్వాధీనం
● ఉత్పత్తికి.. సరఫరాకు మధ్య తేడాలున్నట్లు సమాచారం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలోని ఎస్వీఆర్ డిస్టిలరీస్‌లో సీఐడీ అధికారుల బృందం మంగళవారం చేపట్టిన తనిఖీలు బుధవారం ముగిశాయి. విజయవాడ నుంచి వచ్చిన సీఐడీ అధికారులు బృందాలుగా ఏర్పడి కొన్ని అంశాలు చొప్పున పరిశీలించారు. 2019లో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటైనప్పటి నుంచీ ఈ ఏడాది ఎన్నికల నాటి వరకూ డిస్టిలరీస్‌లో జరిగిన మద్యం తయారీ, ఉత్పత్తి, సరఫరా తదితర అంశాలపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించారు. అదే సమయంలో నెల్లూరు జిల్లాకు చెందిన ఓ రాజకీయ ప్రముఖుడి సంస్థ ఈ డిస్టిలరీస్‌ను లీజుకు తీసుకున్నప్పటి నుంచీ జరిగిన కార్యకలాపాలపైనా సమాచారం తీసుకున్నారు. మద్యం సీసాలపై అతికించే సీళ్ల పక్కదారి పట్టినట్టు, అలాగే తయారైన మద్యం పరిమాణానికి, బయటకు సరఫరా చేసిన మద్యం పరిమాణానికి నడుమ వ్యత్యాసం గుర్తించినట్టు తెలిసింది. అలాగే ఎక్సైజ్ డ్యూటీ చెల్లింపుల్లో కూడా కొంతమేరకు తేడాలను గుర్తించినట్టు సమాచారం. ఈ అంశాలకు సంబంధించి సీఐడీ అధికారులు ఎలాంటి అధికారిక సమాచారం ఇవ్వలేదు. కాగా డిస్టిలరీస్‌లో గత ఐదేళ్లలో మద్యం తయారీకి సంబంధించి డిస్టిలరీస్ ప్రతినిధుల నుంచీ చివరికి హమాలీల నుంచీ కూడా స్టేట్‌మెంట్లు తీసుకున్నట్టు సమాచారం. 2019-2024 నడుమ జరిగిన మద్యం తయారీ, ఉత్పత్తి, సరఫరాలకు సంబంధించిన పూర్తి రికార్డులను సీఐడీ అధికారులు సీజ్ చేశారు. కంప్యూటర్లకు సంబంధించిన హార్డు డిస్కులను కూడా స్వాధీనం చేసుకుని రికార్డులతో పాటు విజయవాడకు తీసుకెళ్ళారు. అక్కడ పూర్తి స్థాయిలో వాటిని పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

తిరుమల ఘాట్‌లో సుమో బోల్తా

● ఎనిమిదిమంది కర్నూలువాసులకు స్వల్పగాయాలు



తిరుమల, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో బుధవారం ఓ టాటా సుమో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిదిమంది భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. కర్నూలుకు చెందిన శివ, సంజయ్ కుటుంబ సభ్యులతో మంగళవారం తిరుమలకు వచ్చారు. స్వామి దర్శనం పూర్తిచేసుకుని బుధవారం ఉదయం తిరుమల నుంచి ప్రైవేట్ సుమోలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని 24వ మలుపు వద్ద వాహనం బోల్తాపడడంతో శివ, సంజయ్‌తో సహా కుటుంబ సభ్యులు, డ్రైవర్ హేమంత్ స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. బ్రేక్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం జరిగినట్టు డ్రైవర్ తెలిపారు.కాగా ఈ మలుపు వద్దనే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ సుమోలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. అంతకుముందు కూడా రెండు వాహనాలు అదుపుతప్పి క్రాష్‌బారియర్‌ను ఢీకొన్నాయి. ఘాట్‌రోడ్డులో మళ్లీ ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అలిపిరి నుంచి తిరుమలకు చేరుకునేందుకు 28 నిమిషాలు, తిరుమల నుంచి తిరుపతికి చేరుకునేందుకు 45 నిమిషాల సమయ నిబంధన ఉన్నప్పటికీ భద్రతా సిబ్బంది తనిఖీ లోపంతో వాహనాలు నిర్దేశిత సమయాని కంటే అతివేగంగా ప్రయాణిస్తున్నాయని, ఈ క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

ప్రియాంకకు భారీ మెజార్టీ ఇవ్వాలని కోరుకున్నా: సీతక్క

తిరుమల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన ప్రియాంక గాంధీ ప్రజల గొంతుక వినిపించేందుకు కేరళ రాష్ట్రంలోని వయనాడ్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారని, ఈ క్రమంలో భారీ మెజార్టీని ఇచ్చి అఖండ విజయాన్ని ప్రసాదించాలని వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్టు తెలంగాణ మంత్రి సీతక్క తెలిపారు. తిరుమల శ్రీవారిని తోమాల, అర్చన, ఉదయం వీఐపీ బ్రేక్ సమయాల్లో దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. పనివత్తిడి కారణంగా మూడేళ్ల తర్వాత స్వామివారిని దర్శించుకున్నట్టు తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ క్రమంలో ప్రభుత్వానికి దీవెనలు ఇవ్వాలని కోరుకున్నట్టు తెలిపారు.

అందే ప్రతి అర్జీకి ఎండార్స్‌మెంట్ ఇస్తూ పరిష్కరించండి

● కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024 జూన్ 15 నుంచి ఇప్పటివరకు 8,996 ఫిర్యాదులు నమోదు కాగా, 6,399 ఫిర్యాదులు నిర్ణీత సమయంలో పరిష్కరించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో భాగంగా అర్జీదారుడికి అర్థవంతమైన ఎండార్స్‌మెంట్ ఇస్తూ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా అధికారులు దృష్టిపెట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రీవెన్స్‌ను ఆడిట్ చేస్తున్నట్లు చెప్పారు. సీఎం పోర్టల్, ఇతర మంత్రుల పేషీ నుంచి అందే అర్జీలను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి సర్వే ప్రక్రియను ఈనెల 30వ తేదీలోగా పూర్తిచేసేలా ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డ్వామా పీడీ రవికుమార్, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● పారిశుధ్య నిర్వహణ, పన్నుల సేకరణపై దృష్టి పెట్టండి

ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు మెరుగైన పారిశుధ్య నిర్వహణ, గ్రామాల్లో పన్నుల వసూళ్లు, స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై దృష్టిపెట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, హౌసింగ్, పీఆర్ ఏడీ, ఏఈ, ఏఏలతో వివిధ అంశాల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. పీఆర్ వన్ యాప్‌లో భాగంగా పొదల తొలగింపు, చెత్తదిబ్బల తొలగింపు, మంచినీటి ట్యాంకుల పరిశుభ్రత, క్లోరినేషన్‌పై దృష్టిపెట్టాలన్నారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో పార్వతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.24 కోట్లు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆదాయం రూ.1,24,94,275 ఆదాయం లభించింది. బుధవారం ఆలయ ఆస్థాన మండపంలో స్వామి కానుకలను ఈవో గురుప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది లెక్కించారు. బంగారు 45 గ్రాములు, వెండి 859 గ్రాములతో పాటు 1011 యూఎస్ఏ, 170 ఆస్ట్రేలియా, 60 సింగపూర్, 20 కెనడా డాలర్లు, 135 యూఏఈ దిర్హామ్స్, 10 ఇంగ్లాండు పౌండ్లు, 50 యూరోలు లభించాయి. వీటితో పాటు గో సంరక్షణ హుండీ ద్వారా రూ.13,870, నిత్యాన్నదాన సత్రం వద్ద హుండీ ద్వారా రూ.21,872 సమకూరాయి. ఈ లెక్కింపులో ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, కాణిపాకం గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయండి: ఎస్ఈ


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్

పెనుమూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు, రైతులకు ఎలాంటి అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం ఆయన పెనుమూరు సబ్‌స్టేషన్, సెక్షన్ ఆఫీసును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పగటిపూట విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందేలా చూడాలని, అందుకు లైన్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. బకాయిల వసూళ్లను పూర్తిచేయాలన్నారు. సబ్‌స్టేషన్, సెక్షన్ ఆఫీసుల్లో పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎన్టీఆర్ జలాశయం వద్ద విద్యుత్ లైన్లను మార్చుచేయడాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ తులసిప్రసాద్, లైన్ ఇన్‌స్పెక్టర్లు ప్రభాకర్ రెడ్డి, పద్మనాభనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపట్నుంచీ పశుగణన

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ పశుగణనలో భాగంగా జిల్లాలోనూ శుక్రవారం నుంచి పశుగణనకు పశుసంవర్థక శాఖ సిద్ధమైంది.ఫిబ్రవరి 28వ తేదీ వరకు 32 మండలాల్లోని 988 రెవిన్యూ గ్రామాలు, వార్డుల్లోని 4,60,076 నివాసాల్లో పశుగణన చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. 384 మంది ఎన్యుమరేటర్లను, 67 మంది సూపర్‌వైజర్లను ఇందుకోసం కేటాయించారు.గేదెలు, ఆవులు, కోళ్ళు , గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు తదితరాలను నమోదు చేస్తారు. పశుగణన ఆధారంగానే ప్రభుత్వం నుంచి బడ్జెట్‌తో పాటు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల వ్యాధి నివారణ మందులు సరఫరా చేస్తారు. ప్రభుత్వ పథకాల ప్రణాళిక అమలు కొరకు, పరిశోధన ప్రాంతాల అభివృద్ధి కొరకు రైతులు కచ్చితమైన సమాచారాన్ని అందజేయాలని అధికారులు కోరుతున్నారు. పశుగణన పర్యవేక్షణకు జిల్లా స్థాయి, డివిజన్, మండల స్థాయి అధికారులను పశుసంవర్థక శాఖ నియమించింది.

పులివేట కేసులో దర్యాప్తు వేగవంతం


డీఎఫ్‌వో ఎస్. భరణి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేటగాళ్ల ఉచ్చుకు బలైన చిరుత పులి కేసులో దర్యాప్తు వేగవంతం చేసినట్లు డీఎఫ్‌వో భరణి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సోమవారం యాదమరి మండలంలో బోడబండ్ల బీట్ వద్ద చిరుత పులి మృతి చెందిన ఘటనలో దర్యాప్తు ప్రారంభించగా, పోస్టుమార్టం అనంతరం వేటగాళ్ల ఉచ్చుకు బలైనట్లు గుర్తించామని చెప్పారు. ఈ మేరకు అనుమానితుడైన ఒకరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా, మరో ముగ్గురికిఈ ఘటనలో ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా తేలిందన్నారు. ఒకట్రెండు రోజుల్లో పూర్తి వివరాలను ప్రకటించనున్నట్లు చెప్పారు. అటవీ ప్రాంతంలో అక్రమంగా వున్న విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించేందుకు కలెక్టర్ నుంచి ఆమోదం పొందినట్లు తెలిపారు. ఇప్పటికే విద్యుత్ లైన్లు తొలగించేందుకు కొన్ని ప్రాంతాలను గుర్తించామన్నారు. ఇందుకోసం అటవీ, విద్యుత్ శాఖల అధికారుల సహకారంతో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తామన్నారు. అనంతరం అటవీ సమీప ప్రాంతాల్లోని రైతుల భూముల్లో విద్యుత్ వైర్ల కారణంగా అడవిలో జంతువులు మృతిచెందితే ఆ భూమి యజమానులనే దోషులుగా పరిగణలోకి తీసుకోనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన


తాగునీటి కోసం మహిళల నిరసన

పుంగనూరు రూరల్, అక్టోబరు23(ఆంధ్ర జ్యోతి): మండలంలోని గుడిసిబండ గ్రామంలో ఏడాదిగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మహిళలు ఖాళీబిందెలతో రోడ్డుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగు నీటి కోసం దాదాపు కిలోమీటర్ దూరంలో ఉన్న గంగమ్మ గుడివద్దకు వెళ్లి తీసుకురావాల్సివుందన్నారు. మరి కొందరు పక్క గ్రామాలకు వెళ్లి తాగునీరు తీసుకువస్తున్నట్లు వాపోయారు. మంచినీరు లేకపోయినా లక్షలు ఖర్చు చేసి ట్యాంకు నిర్మించారని, నిర్మించి 8నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ట్యాంకుకు ఒక రోజు నీరు వదిలిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్యక్రమంలో మహిళలు యశోదమ్మ, సరస్వతి, నారాయణమ్మ, లక్ష్మమ్మ, పార్వతమ్మ, నాగజ్యోతి, సుశాలమ్మ, సింధు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు : డీపీవో


మాట్లాడుతున్న డీపీవో పార్వతి

కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని డీపీవో పార్వతి పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. పులిచెర్ల సచివాలయంలో బుధవారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పీఆర్-1 యాప్‌లో ఎప్పటికప్పుడు పంచాయతీకి సంబంధించి పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పర్యవేక్షణ ఉండాలని, వీధిలైట్లు సమస్య లేకుండా చూడాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభాకర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పిల్లల్లో జ్ఞానం పెంపునకు బాలవికాస్ కేంద్రాలు దోహదం


పిల్లలతో కలిసి భజన చేస్తున్న మధుసూదనం

పుంగనూరు,అక్టోబరు 23: పిల్లల్లో జ్ఞానం పెంపొందించడానికి బాలవికాస్ కేంద్రాలు దోహదపడుతాయని జిల్లా శ్రీసత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు ఎస్.మధుసూదనం తెలిపారు. బుధవారం పుంగనూరు సాయిబాబా మందిరంలో బాలవికాస్ కేంద్రాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భజన, సమయపాలన, ఆరోగ్యం, ఆధ్యాత్మికం తదితర అంశాలపై ఆయన పిల్లలకు వివరించారు. వీటిని ఆచరించడం వల్ల జ్ఞానం పెంపు, తదితర ప్రయోజనాలు చేకూరుతాయని పిల్లలకు శిక్షణ ఇచ్చారు. బాలవికాస్ జిల్లా జాయింట్ కోఆర్డినేటర్ హేమలత, గురువులు పావని, భారతి, లావణ్య, సమన్వయకర్త దేవరాజులు పాల్గొన్నారు.

తహసీల్దార్ చొరవతో కల్వర్టులో పూడికతీత



సోమల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం కారణంగా అన్నెమ్మగారిపల్లె వీధులు వర్షపు నీటితో నిండి పోయాయి. కల్వర్టును పూడ్చి వేయడంతో జలమయంగా మారింది. బుధవారం అన్నెమ్మగారిపల్లె వీధుల్లో వర్షపు నీళ్ల వార్తా కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో తహసీల్దార్ బెన్నురాజ్ స్పందించారు. రెవెన్యూ సిబ్బందితో కలసి గ్రామంలో పర్యటించారు. వర్షపు నీరు దిగువకు వెళ్లకుండా కల్వర్టులను మట్టితో పూడ్చివేయడం గుర్తించి పూడిక తీయించారు. కార్యక్రమంలో కార్యదర్శి లలిత, వీఆర్వో మురళి, మాజీ సర్పంచు బంగారప్ప పాల్గొన్నారు.

ఉరుస్తున్న పాఠశాల భవనం



పుంగనూరు రూరల్, అక్టోబరు23(ఆంధ్ర జ్యోతి): మండలంలోని గుడిసిబండ పాఠశాల భవనం పై పెచ్చులు ఊడుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ పాఠశాలలో ఎస్సీ వర్గానికి చెందిన 10మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కొద్దిపాటి వర్షం కురిస్తే పాఠశాలలో నీరు కారడంతోపాటు పై పెచ్చులు ఊడుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. పక్కనే పంచాయతీ భవనం ఖాళీగా ఉందని, పాఠశాలకు కేటాయిస్తే ఇబ్బందులు తొలుగుతాయని ఉపాధ్యాయురాలు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో జాప్యమెందుకు ?

ఎంపీడీఓను సంజాయిషీ కోరిన ప్రజాప్రతినిధులు

పలమనేరు : మండల సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన అభివృద్ధి పనుల విషయంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారో మూడు రోజుల్లో లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని ఎంపీపీ రోజా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీడీవో ఖాదర్‌బాషాను సంజాయిషీ కోరారు. బుధవారం ఆ మేరకు వారు ఎంపీడీవోను కలిసి మూడు అభివృద్ధి పనులను ఇప్పటివరకు ఇంజినీరింగ్ అధికారులకు ఎందుకు పంపలేదో, అదేవిధంగా జడ్పీనుంచి మంజూరు అయిన రూ. 32 లక్షలకు సంబంధించి ఎందుకు పనులు చేపట్టలేదో తెలియజేయాలని కోరారు.దీనిపై కలెక్టర్, జడ్పీ చైర్మన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

సీఎంను కలసిన ఎస్కే



చౌడేపల్లె, అక్టోబర్22: (ఆంధ్రజ్యోతి) సీఎం చంద్రబాబు నాయుడుడిని బోయకొండ మాజీ చైర్మన్ ఎస్కే వెంకటరమణరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుంగనూరు నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి సహకరించాలని వినతి చేసినట్లు తెలిపారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

రామకుప్పం : విద్యార్థులు దురవాట్లకు దూరంగా ఉండాలని కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్ కోరారు. బుధవారం రామకుప్పం ఏపీ మోడల్ స్కూల్‌లో రోడ్డుభద్రత-దురలవాట్లపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు రాకపోకలు సాగించేటపుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కదులుతున్న వాహనాల్లో ఎక్కరాదన్నారు. మైనర్లు ద్విచక్రవాహనాలను నడపరాదని, మేజర్లు ద్విచక్రవాహనాలు నడిపేటపుడు రోడ్డు భద్రత జాగ్రత్తలను తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్డీవో

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పలమనేరు నూతన ఆర్డీవో జి.వెంకటేష్ బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలమనేరు మున్సిపాలిటీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి నూతన ఆర్డీవోకు కలెక్టర్ వివరించారు.

హెచ్‌ఎంల సమావేశం

సోమల : సోమల ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంఈవో శివరత్న హెచ్‌ఎంలతో సమావేశమై కాంప్లెక్స్ రీ ఆర్గనైజన్, ఎఫ్-1, ఎఫ్-2పరీక్షల నిర్వహణ, విద్యాపరమైన అంశాలను సమీక్షించారు. సమావేశంలో హెచ్‌ఎంలు హరినాథ్, కుసుమాంబ, నిరంజన్‌కుమార్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి : ఎమ్మెల్యే


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణమే స్పందించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. బుధవారం పలమనేరులో నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీరు, మరుగుదొడ్లు, రహదారులు, పైప్‌లైన్ పనులు తదితర అంశాలపై ఆయన మండలాల వారీగా వివరాలు తెలుసుకొన్నారు. పనులలో జాప్యం చేయెద్దని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు హెచ్చరించారు. గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు బాలాజి, ఖాదర్‌బాషా, సురేష్, రాజేంద్రబాలాజి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎస్‌డీఈ స్టాలిన్, పీఆర్ డీఈ మహేష్, ఏఈలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజవంతం చేయాలి

పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. బుధవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ మండల అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం పొంది క్రియాశీలకంగా రాణిస్తున్న ప్రతిఒక్కరూ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్‌వి. బాలాజి, మండల పార్టీ అధ్యక్షులు కిషోర్‌గౌడు, రంగనాథ్, సోమశేఖర్ గౌడు, నాగరాజు రెడ్డి, ఆర్‌బీసీ కుట్టి, ఆనంద, నాయకులు విజయభాస్కర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాంబాబు, శ్రీరాములు, గిరిబాబు, ఖాజాపీర్, నాగరాజు, మదన్‌మోహన్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి

పలమనేరు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) : రైతులు మామిడి పంటలను అధికంగా సాగుచేయడం వలన దిగుబడి పెరిగి ఆదాయం తగ్గుతోందని, కావున రైతులు ఇతర ఉద్యానపంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి సూచించారు. బుధవారం పలమనేరు రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు మామిడికే పరిమితం కాకుండా సీతాఫలం, జామ, జీడి మామిడి, ఉసిరి, నేరేడు, అవకాడో, డ్రాగన్‌ఫ్రూట్, చింత తదితర ఉద్యానవన పంటలు సాగు చేయాలన్నారు. వీటి సాగుకు ప్రభుత్వం ఒక హెక్టారుకు రూ. 18వేల నుంచి రూ. 25 వేల వరకు సబ్సిడీ అందిస్తోందన్నారు. కాకర, బీర, వంగ పంటలు సాగుచేసే రైతులకు పందిర్ల ఏర్పాటుకు రూ. లక్ష వరకు రాయితీ అందస్తోందన్నారు. ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, పెద్దరైతులకు (5ఎకరాలుపైన) 70 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు. స్ప్రింక్లర్లు కూడా 45-55 శాతం వరకు రాయితీపై అందుబాటులో వున్నాయన్నారు. రైతు సేవాకేంద్రం ద్వారా రైతులు తమ వాటా చెల్లిస్తే వెంటనే పరికరాలు డెలివరీ చేస్తామన్నారు. ఏడీఏ నాగమణి పంట పొలాల్లో అడవి పందుల దాడుల నివారణకు ఉన్న యాజమాన్య పద్ధతులను వివరించారు. మరో ఏడీఓ విజయశంకరరెడ్డి వరి పంట సాగులో, కోత సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఏవో సంధ్య ట్రైకోడెర్మావిరిడి ఉపయోగాలను రైతులకు వివరించారు. ఏఈఓ కుమార్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం వాసు, బోడిపాటివారిపల్లె వద్ద వరి పొలాన్ని పరిశీస్తున్న ఏవో సుధారాణి

కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు తెలిపారు. పులిచెర్ల మండలం పాతపేటలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు నిర్వహించన అవగాహన సదస్సుకు డీపీఎం వాసు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన, విషరహితమైన పంటలు చేతికందుతాయన్నారు. రసాయన పద్ధతిలో పండించే పంటల కంటే సేంద్రియ పద్ధతిలో పండించే పంటలకు ఎక్కువ మద్దతు ధర లభిస్తుందన్నారు. పెట్టుబడులు తక్కువని, లాభాలు అధికంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అలాగే పులిచెర్ల మండలం రాజులపల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం విజయవంతమైనట్లు ఏవో శ్రీనివాస్ తెలిపారు. వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ సబ్సిడీ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

వర్షంతో వాలిన వరి పంటలు

రొంపిచెర్ల : మండలంలో తుఫాన్ ప్రభావంతో చేతికి వచ్చిన వరి పంటలు నేలవాలాయి. ఈ నేపథ్యంలో బుధవారం బోడిపాటివారిపల్లె, బండకిందపల్లె, పెద్దమల్లెల, మోటుమల్లెలలో సాగుచేసిన వరి పొలాలను ఏవో సుసధారణి ఆర్‌బీకే సిబ్బందితో కలిసి పరిశీలించారు. మండలంలో 480 ఎకరాల్లో వరి సాగు చేయగా వర్షాల కారణంగా 55 ఎకరాల వరకు కోత కొచ్చిన వరిపైరు నేల వాలింది. రైతులతో ఏవో మాట్లాడుతూ వరి పొలాల్లో నీటిని తొలగించాలని, కట్టలు వేసి లీటరుకు 50గ్రాములు ఉప్పు కలిపి ఆ ద్రావణాన్ని పిచ్చికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకట్రమణనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధ్యం



కొత్తపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, రాగానిపల్లెలో ఉలవ పంటను పరిశీలిస్తున్న మురళీకృష్ణ

గంగవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షలు చేసుకోవడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు అనుకున్న దిగుబడి సాధించడానికి దోహదపడుతుందని ఏడీఏ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లెలో రైతులకు భూసార పరీక్షల వలన కలిగే ప్రయోజనాలు, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి రైతూ ప్రతి ఏడాది పొలంలోని మట్టిని ఆర్‌ఎస్‌కే సిబ్బందిచే భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వారా ఆ భూమిలో మట్టి సామర్థ్యం ఎంత అని స్పష్టంగా తెలుసుకోవచ్చన్నారు. అందుకు అనుగుణంగా ఎరువులను ఉపయోగించి, అనువైన పంటలు పండించడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏలు విజయభాస్కర రెడ్డి, నాగపద్మజ, ఏఓ హేమలత, ఆర్ఎస్‌కే అధికారిణి హరిత, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో పంటల దిగుబడి

పుంగనూరు : సేంద్రి ఎరువులతోనే పంటల దిగుబడి పెరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పుంగనూరు మండలం రాగానిపల్లె పంచాయతీలో వేసిన ఉలవ, కంది పంటలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, నూతన వ్యవసాయ విధానాలపై రైతులు అవగాహన పెంచుకోవాల్సివుందన్నారు. పొలాలకు అవసరం మేరకే ఎరు వులు, మందుల పిచికారీ చేయాల్సివుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శివకుమార్‌రాజు, ఏవో ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

కల్లూరు,అక్టోబరు23(ఆంధ్ర జ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లిలో బుధవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి ఎస్వీ ఆయుర్వేద కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరానికి 200 మంది రోగులు హాజరయ్యారు. వీరికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ ఆయర్వేద కళాశాల ప్రిన్సిపాల్ రేణుదీక్షిత్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యానికి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఆయుర్వేదం ద్వారా ఆరోగ్య సంక్షేమం, జీవనశైలి, పంచకర్మ చికిత్సలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచకర్మ విభాగాధిపతి హర్షవర్ధన్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి, పీజీ విద్యార్థులు తేజ, చంద్రిక పాల్గొన్నారు.

29న రొంపిచెర్లలో మండల మీట్

రొంపిచెర్ల,అక్టోబరు23: (ఆంధ్ర.జ్యోతి) రొంపిచెర్ల మండల సర్వసభ్య సమావేశం ఈనెల 29వ తేది నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత రెండు పర్యాయాలు కోరం లేక సమావేశం వాయిదా పడిన విషయం విదితమే.

విద్యార్థులకు విందు భోజనం



పలమనేరు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) :పలమనేరు బాలికోన్నత పాఠశాలలో బుధవారం శుభదిన్ భోజన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు పుష్పవతి తన దాతృత్వంతో విద్యార్థులకు ప్రత్యేక వంటకాలతో విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేసిన పుష్పావతిని ఎంఈఓ లీలారాణి, హెచ్‌ఎం పి.లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

రొంపిచెర్ల, అక్టోబరు23: (ఆంధ్రజ్యోతి) మండలంలో ఉపాధి హామీ పనులు నాణ్యతగా, వేగంగా చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వెయ్యి ఇంకుడు గుంతలు, 87 పశువుల షెడ్లు మంజూరు అయ్యాయని, ఇంకుడు గుంతకు రూ.6వేలు, ఒక్కొక్క పశువుల షెడ్ రూ.2.30 లక్షలతో నిర్మించుకోవాలని తెలిపారు. సమావేశంలో ఏపీవో బాలమురళి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 19మందికి జరిమానా

పుంగనూరు రూరల్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 19మందికి జరిమానాలు విధించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేసి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న19 మందిని గుర్తించి వారికి రూ. 10వేలు చొప్పున జరిమానా విధించగా మొత్తం రూ. 1.90 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపినా, మైనర్లు వాహనాలు నడిపినా జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

టిడ్కో చైర్మన్‌ను కలిసిన ఎన్వీఆర్ ట్రస్ట్ చైర్మన్



పుంగనూరు, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్‌ను పుంగనూరు మండలం ఎన్వీఆర్ ట్రస్ట్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, జనసేన నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం విజయవాడలో టిడ్కో పరిపాలన భవన్‌లో ఆయన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను కలిశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పడగల రమణ, విరూపాక్షిచైతన్యరాయల్, హరినాయక్, బాలాజీనాయక్, రాయల్, ట్రస్ట్ సభ్యులు శివకుమార్ రెడ్డి, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నడగడ్డ గ్రామసభకు 106 అర్జీలు

సదుం, అక్టోబరు 23 : మండలంలోని నడిగడ్డ గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో ప్రజల నుంచి 106 వినతులు అందినట్లు తహసీల్దారు ఎస్.ఎం.హుస్సేన్ తెలిపారు. వాటిలో అధికంగా ఒకే సర్వే నెంబర్‌తో ఇద్దరు, ముగ్గురికి పట్టాలు ఉండడం, వారికి వన్-బి రాకపోవడం, భూవిస్తీర్ణంలో వ్యత్యాసం, కొత్త పాసు పుస్తకాల కోసం, అసైన్డ్ భూములు పంపిణీ, దారి సమస్యలు తదితర అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ కుమార్, వీఆర్వో బావాజీ, మండల సర్వేయర్ ద్వారకనాథ్, గ్రామ సర్వేయర్ సతీశ్, సర్పంచ్ నారాయణ రెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు పవన్ కుమార్ రెడ్డి, ఈశ్వర రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మంచు దుప్పట్లో సదుం



సదుం పట్టణంతోపాటు మండలంలోని ఇతర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు మంచు దట్టంగా కురిసింది. చలికాలం ఆరంభంలో ఉదయం 8 వరకు మంచు కురుస్తుండడం స్థానికుల్లో ఆహ్లాదాన్ని నింపింది. మంచు కారణంగా వాహనదారులు ఉదయం పూట హెడ్ లైట్లు వేసుకుని ప్రయాణం సాగించారు. - సదుం

నిండుగా కురవపల్లె చెరువు



అన్నెమ్మగారిపల్లె పంచాయతీలోని కురవపల్లె చెరువు ప్రమాద స్థితికి చేరుకుందని ఆయకట్టు రైతులు బుధవారం తహసీల్దార్ బెన్నురాజ్‌కు వినతిచేశారు. ఈ చెరువు ఇటీవల భారీ వర్షాలకు నిండింది. చెరువు ప్రమాద స్థితికి చేరుకోవడంతో దిగువన ఉన్న అన్నెమ్మగారిపల్లె ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చెరువుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. - సోమల

శునకాల దండయాత్ర



సదుంలో బుధవారం ఉదయం శునకాల కారణంగా స్థానికులు ఇబ్బందిపడ్డారు. రోడ్డంతా తమదేనన్నట్లు స్వైర విహారం చేయడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు సంకటంగా మారింది. బుధవారం ఓ పాడి ఆవు గొంతును ఓ శునకం కొరకడంతో ఆ ఆవు తీవ్రంగా గాయపడింది. శునకాల బెడద నుంచి కాపాడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. - సదుం

రోడ్డు గుంతలమయం



పుంగనూరు నుంచి రాగానిపల్లెకు రెండేళ్ల క్రితం తారురోడ్డు వేశారు. అప్పట్లో నేతిగుట్టపల్లె వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టు కోసం మేలుపట్ల చెరువు నుంచి టిప్పర్లతో ఈ మార్గంలో మట్టిని తరలించారు. ఆ సమయంలో తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలు పడ్డాయి. కొద్దిపాటి వర్షం కురిస్తే ఈ మార్గంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. - పుంగనూరు

చెరువులకు జలకళ సంతరించుకోవడం ఆనందదాయకం



బీరప్పచెరువులో జల హారతి ఇస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి చెరువులు నిండి జల సంతరించుకోవడం ఆనందదాయకమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం ఆయన ఐరాల మండలంలో పెద్ద చెరువులలో ఒకటైన బీరప్పచెరువు వద్దకు విచ్చేసి మొరవ వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, గంగమ్మకు సారెను అందించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం గద్దెనెక్కిన అనంతరం నియోజకవర్గంలో చాలావరకు చెరువులు నిండాయన్నారు. బీరప్పచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలోని సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్ బాబు, నాయకులు హరిబాబు నాయుడు, ఎన్.ఎం.చౌదరి, ధనంజయ నాయుడు, దయానంద మండడి, లత, చిత్రా నాయుడు, రంజిత్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

పాలసముద్రం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కృష్ణజిమ్మాపురంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను బుధవారం ఎంపీడీవో కృష్ణమహేష్ రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులను కాంట్రాక్టర్లు త్వరగా పనులు ప్రారంభించి నెల రోజుల్లో పూర్తి చేయాలని కోరారు. పాలసముద్రం పీహెచ్‌సీలో నిర్మిస్తున్న అదనపు భవన నిర్మాణాల పనులను పరిశీలించారు. ఈవోపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శి జయశంకర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి



కె.వెంకటరమణ (ఫైల్ ఫొటో)

ఐరాల, అక్టోబరు 23(ఆంధ్ర జ్యోతి): ఐరాల పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటరమణ అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్ఐ నరసింహులు తెలిపారు. కొంత కాలంగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స తీసుకుంటున్నారు. పరిస్థితి విషమించి బుధవారం ఆయన మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి ఎస్ఐ, పోలీస్ స్టేషన్ సిబ్బంది తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పోగొట్టుకున్న బ్యాగు మహిళకు అందజేత

గుడిపాల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నంగమంగళం స్టేట్‌బ్యాంకు వద్ద బుధవారం ఓ మహిళ బ్యాగును పోగొట్టుకుంది. టీడీపీ నేతలు రుద్రాచారి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ బ్యాగును గమనించి చెన్నైకు చెందిన పవిత్రకు అప్పగించారు.

బియ్యం పంపిణీ చేయండి

పాలసముద్రం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్‌కార్డు దారులకు బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ అరుణకుమారి ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ప్రతి కార్డు దారుడికి బియ్యాన్ని అందజేసి మండలానికి మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ నాగరాజు, డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఏఆర్ ఏఎస్పీ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 23: జిల్లా ఏఆర్ ఏఎస్పీగా శివానంద కిశోర్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1992 బ్యాచ్‌లో ఏఆర్ ఎస్ఐగా పోలీసుశాఖలో చేరారు. 2000లో ఆర్ఐగా పదోన్నతి పొంది చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో విధులు నిర్వర్తించారు. 2011లో డీఎస్పీగా చిత్తూరు పీటీసీలో వైస్ ప్రిన్సిపాల్‌గా, కళ్యాణ్ డ్యామ్ పీటీసీలోనూ వైస్ ప్రిన్సిపాల్, తిరుమలలో విజిలెన్స్ అధికారిగా పనిచేశారు. అనంతరం పదోన్నతి పొంది చిత్తూరు జిల్లా ఏఆర్ ఏఎస్పీగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏఆర్ అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ మణికంఠ చందోలును శివానంద కిశోర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవు

నింద్ర, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన రికార్డులను పూర్తిస్థాయిలో ఉంచుకోవలని చిత్తూరు ఎంవీఐ కుసుమ అన్నారు. బుధవారం నింద్ర నేతమ్స్ షుగర్స్ తిరుపతి-చెన్నై జాతీయ రహదారిలో వాహనాలను తనిఖీ చేసి, రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు జరిమానా విధించారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.లక్షా75వేలు



హుండీ లెక్కింపు చేస్తున్న ఆలయ సిబ్బంది

శ్రీరంగరాజపురం, అక్టోబరు, (ఆంధ్రజ్యోతి) 23: ఎస్ఆర్‌పురం మండలంలో ఆరిమాకుపల్లె వెలసిన ఆరిమాని గంగమ్మ దేవస్థానంలో బుధవారం ఈవో తిమ్మరెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ మార్చి నెల నుంచి ఈరోజు వరకు భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించగా, రూ.1,75,596 ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లింగారెడ్డి, ఆచార్యులు వెంకటాచలపతి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు తీగలను పట్టించుకోండి



కొండకిందపల్లె సమీపంలో అల్లుకుపోయిన నిర్లక్ష్యపు తీగలు

వెదురుకుప్పం, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): ప్రమాదమని తెలిసినా పట్టించుకోవడం లేదు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యపు తీగలు రైతులకు ప్రాణ సంకటంగా మారాయి. అసలే వర్షాకాలం.. ఆపై విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకుపోయిన చెట్లతీగలు. ఇది వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ కొండకిందపల్లెకు చెందిన కేశవులురెడ్డి పొలం వద్ద ఉంది. విద్యుదాఘాతానికి ఎవరూ గురికాక ముందుగానే క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బంది స్పందించాల్సి ఉంది.

స్పందన ఆర్జీలను పరిష్కరించండి



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఆర్‌డీవో అధికారులు

శ్రీరంగరాజపురం, అక్టోబరు, (ఆంధ్రజ్యోతి) 23: స్పందన ఆర్జీలను మండల స్థాయిలో వెంటనే పరిష్కరించాలని, మండలస్థాయిలో పరిష్కారం కానీ సమస్యలను మా దృష్టికి తీసుకురావాలని ఆర్డీవో ఎస్.శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఎస్ఆర్‌పురం మండలం చిత్తూరు-తచ్చూరు టూ డీఆర్‌డీవో అప్రోచ్‌కు సంబంధించిన స్థలాన్ని ఆర్డీవో పరిశీలించారు. డీఆర్‌డీవో మెయిన్ గేట్ నుంచి చిత్తూరు-తచ్చూరు అప్రోచ్ రోడ్డు వరకు సంబంధించి భూసేకరణ నిమిత్తం సంబంధిత రైతులతో చర్చలు జరిపారు. సర్వీసు రోడ్డు కోసం భూమి కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని ఆయన తెలిపారు.తహసీల్దార్ లోకనాధంపిళ్లై, డీఆర్‌డీవో అధికారులు, రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

ఐరాల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం బుధవారం ఐరాల ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల తరపున ప్రిన్సిపాల్ రెడ్డి రామరాజు ఎమ్మెల్యే మురళీమోహన్‌కు రూ.25,796 డీడీని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధ్యాపకులు సీఎం రిలీఫ్ ఫండుకు నిధులు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విజయ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నగరిలో క్వారీలను రద్దు చేయాలి

నగరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరి సమీపంలోని క్వారీలను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్ సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ తరతరాలుగా ఆవులు, మేకలను మేపుకుంటూ, పంటలు పండించుకుంటున్న భూములలో క్వారీల ఏర్పాటు కారణంగా స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో షబ్బీర్‌బాషా, విజయ్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

21 మందికి ఉద్యోగావకాశం

వెదురుకుప్పం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఐటీఐలో నిర్వహించిన జాబ్ మేళాలో 21 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.గణేష్ బుధవారం తెలిపారు. జాబ్ మేళాకు జస్టడయల్, బిగ్‌సి, అల్ట్రాస్ట్ టెక్నాలజీ కంపెనీలు వచ్చాయని చెప్పారు. ఈ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాల కోసం 52 మంది వస్తే 21మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు.

బంగారుపాళ్యం - అరగొండ రహదారిలో ఆక్రమణలు

ట్రాఫిక్ ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు



ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు, స్కూల్ వ్యాన్లు

బంగారుపాళ్యం, అక్టోబరు 23: మండల కేంద్రమైన బంగారుపాళ్యం నుంచి అరగొండకు వెళ్లే రహదారిలో తహసీల్దార్ కార్యాలయం వరకు దుకాణదారులు దుకాణాల ముందు ఎత్తుగా మట్టిని వేయడంతో వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారి గుండా కాణిపాకం, అర్ధగిరి పుణ్యక్షేత్రాలకు బెంగళూరు నుంచి భక్తులు అధిక సంఖ్యలో వాహనాల్లో వెళ్తుంటారు. వాహనాలు ఎదురెదురుగా వస్తే సుమారు అరగంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు నిత్యం ఈ రోడ్డులోనే వెళుతుంటారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదు. చిత్తూరు-పలమనేరు రహదారిలో కూడా దుకాణదారులు ఇష్టానుసారంగా ముందర రేకుల షెడ్లు నిర్మించుకుని అంగళ్లు నిర్వహించుకుంటున్నారు. తోపుడు బండ్లు సైతం సగం రహదారిలో వరకు పెట్టుకుని నడుపుకుంటున్నారు. పంచాయతీ అధికారులు మాత్రం రుసుము వసూలు చేసుకుని వెళ్లిపోతున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అరగొండకు, చిత్తూరు-పలమనేరు వెళ్లే రహదారుల్లో ఆక్రమణలు తొలగించి ప్రయాణికులకు, ప్రజలకు అంతరాయం కలగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మండలాభివృద్ధిలో ప్రజా ప్రతినిధులే కీలకం



మాట్లాడుతున్న ఎంపీపీ దీప

నింద్ర, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధిలో ప్రజా ప్రతినిధులే కీలకమని ఎంపీపీ దీప అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నింద్ర మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండల అధికారులు సిబ్బంది ప్రోటోకాల్ విధిగా పాటించి ప్రజా ప్రతినిధులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. పంచాయితీలలో చేపట్టే అభివృద్ధి పనులను సర్పంచులకు, ఎంపీటీసీలకు తెలియజేయాలన్నారు. మండల అభివృద్ధిలో అధికారులు పార్టీలకు అతీతంగా పనిచేయాలన్నారు. ఎంపీపీ నిధులను ప్రత్యేకించి ఎంపీటీసీలను కేటాయించాలని ఎంపీటీసీలు కోరారు. వైస్ ఎంపీపీ దుర్గాదేవి, కావనూరు ఎంపీటీసీ, విజేష్, ఇరుగువాయి, పాదిరి సర్పంచులు రాజేష్, సూర్య, కోఆప్షన్ మెంబర్ అనిల్, సర్పంచ్ ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, ఉపాధి ఏపీవో బబిత, ఎంఈవో వసుమతి దేవి, ఏవో తులసీరామ్, ఏఈలు వీరభద్రయ్య, శ్రీదర్‌రాజు, ఈవోపీఆర్‌డీ లక్ష్మిపతి పాల్గొన్నారు.

ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించండి

నగరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని నగరి మున్సిపల్ చైర్మన్ నీలమేఘం సూచనల మేరకు కమిషనర్ కృష్ణారెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన రహదారుల్లో మురుగునీటి కాలువలను దాటి పలువురు నిర్మాణాలు చేపట్టారని, వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఆక్రమణలకు పాల్పడిన వారు స్వచ్ఛందంగా తొలగించడానికి రెండు రోజులు సమయం ఇస్తున్నామని, అలా తొలగించకపోతే అధికారులే చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగిస్తారని కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు.

కోర్టు ఆవరణలో నూతన క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ద్వారకనాథరెడ్డి

చిత్తూరు లీగల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను రాష్ట్ర న్యాయవాదుల మండలి అధ్యక్షుడు నల్లారి ద్వారకనాథ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, చిత్తూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్‌తో పాటు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పెనుమూరు కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రం



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రఘురామన్

పెనుమూరు, అక్టోబరు 23: పెనుమూరు పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ రఘురాం ఎస్పీ మణికంఠ చందోలు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నాడు. పలు క్రైం కేసుల్లో ప్రతిభ కనబరిచినందుకు, చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీలో కీలకంగా వ్యవహరించినందుకు ప్రశంసా పత్రంతో అభినందించారని రఘురామన్ తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నెల్లేపల్లె హైస్కూల్ విద్యార్థినుల ఎంపిక

గంగాధరనెల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లేపల్లె హైస్కూల్లో చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడాపోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సుబ్బరత్నమ్మ, అసిస్టెంట్ హెచ్ఎం యుగంధరాచారి, పీడీలు లక్ష్మయ్య రజిని తెలిపారు. విద్యార్థినులు సి.యామిని (వాలీబాల్), కె.గగన (ఫుట్‌బాల్), జి.కుసుమ, టి.కీర్తిక, జి.భవ్యశ్రీలు (హాకీ) రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనున్నట్లు వారు చెప్పారు. వీరిని హెచ్ఎం, అసిస్టెంట్ హెచ్ఎం, పీడీలు, పలువురు టీచర్లు అభినందించారు.

మునీశ్వర ఆలయంలో చోరీ



చోరీకి గురైన ఆలయ హుండీ

నగరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలో కశింమిట్టలో నూతనంగా నిర్మించిన మునీశ్వర ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. చోరీకి పాల్పడిన దుండగులు ఆలయం చుట్టూ వున్న సీసీ కెమెరాలలో కొన్నింటిని ధ్వంసం చేసి మరి కొన్నింటికి గుడ్డలు చుట్టేసి గదిలో వున్న హార్డ్ డిస్క్‌ను ధ్వంసం చేశారు. తలుపుల పగులగొట్టారు. హుండీ చుట్టూ వేసిన కాంక్రీట్‌ను పగులగొట్టి, హుండీని దూరంగా తీసుకెళ్లి దానిలో ఉన్న డబ్బును చోరి చేశారు. ఆలయ నిర్వాహకుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ చోరీ జరిగిన ప్రాంతాల్లో ఆధారాలకోసం పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

వెదురుకుప్పం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడిన ఘటన బుధవారం కార్వేటినగరం మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం. తమిళనాడులోని కర్లంబాకంకు చెందిన తరుణ్‌కుమార్(35), నిఖిత(30) దంపతులు బైక్‌లో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై తిరుపతికి బయలుదేరారు. అదే సమయంలో కార్వేటినగరం వైపు నుంచి స్కూటీలో పళ్లిపట్టు వైపు జాతీయ రహదారిపై వెళుతుండగా, కార్వేటినగరం-ఆర్కేవీబీపేట మధ్య ఎదురెదురుగా రెండూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తరుణ్‌కుమార్, నిఖిత గాయపడ్డారు. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్య సేవలకోసం తిరుపతికి తరలించారు. సీహెచ్‌సీలో డ్యూటీలో ఉండాల్సిన వైద్యులు లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

68వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు



రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

నగరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): 68వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు బుధవారం నగరిలో హోరాహోరీగా జరిగాయి. ఏకాంబరకుప్పం ఉన్నతపాఠశాలలో నెట్‌బాల్ పోటీలు, పీసీఎన్ ఉన్నత పాఠశాలలో అండర్-17 బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలలో గెలుపొందిన తేజేష్, భానుప్రకాష్, ఇజాజ్, వెంకట్, రక్షన్, సిద్ధిక్, అభినేష్, మోహిత్‌కుమార్, నేత్రసాయి, జశ్వంత్, అప్సర్, అయ్యన్, గైతమ్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల జట్టుకు ప్రశాంతి, గీతిక, చరణ్య, రుత్విక, మహేశ్వరి, మమత, నీరజ, ప్రియదర్శిని, శ్రీహిత, విజయలక్ష్మి, లేఖశ్రీ, తేజశ్రీ, రూబి ఫిర్దోస్‌లు ఎంపికయ్యారు. నెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి జట్లు నవంబరులో విశాఖపట్నంలో జరిగే పోటీలలో పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు వసంతవాణి, బాబు తెలిపారు.

రీసర్వేలో భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



ముక్కరవానిపల్లెలో జరిగిన గ్రామసభ

వెదురుకుప్పం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని కార్వేటినగరం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ స్వరూపరాణి తెలిపారు. బుధవారం కార్వేటినగరం మండలం ముక్కరవానిపల్లెలో సర్పంచ్ గుణవతి లోకనాథ నాయుడు అధ్యక్షతన గ్రామసభ జరిగింది. స్వరూపరాణి మాట్లాడుతూ రీసర్వేలో వచ్చిన భూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ భగవతి, వీఆర్వో నరసింహారెడ్డి, సర్వేయర్ బాబు, చామంతి తిరుమలయ్య, గుండాల లోకనాథ నాయుడు, చామంతి సురేష్, గుండాల ప్రసాద్, అప్పిలి జనార్ధన్ నాయుడు పాల్గొన్నారు.

రీసర్వేలోని తప్పులు సరిదిద్దుతాం

నింద్ర, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): రీసర్వేలోని జరిగిన తప్పులను సరిదిద్దుతామని నగరి ఆర్డీవో వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాదిరిలో జరిగిన గ్రామసభలో ఆయన స్పష్టంచేశారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కైపాకంలో రోడ్డు సమస్యను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, టీడీ మాధవి, ఆర్ఐ కళావతి, సర్వేయర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.